# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు.
- ❖ మూడు రోజుల బ్రిక్స్ ప్రధాన న్యాయమూర్తుల సదస్సు ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది.
- ❖ భూస్థిర కక్ష్యలోకి భారతదేశపు తొలి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్-17 విజయవంతంగా ప్రయోగించింది.
- ❖ భారత్.. ఫ్రాన్స్‌తో అంతరిక్ష భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కోరుకుంటోందని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

=========================

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణుడి జీవితగాథ, ఆయన బోధనలు భారతీయ సంస్కృతి, తత్వశాస్త్రాలకు నూతన స్ఫూర్తిని అందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శ్రీకృష్ణుడి ఆదర్శాలను జీవితంలో ఆచరిస్తూ... సమ్మిళితమైన, వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. శ్రీకృష్ణుడి జీవితం, సందేశం మానవాళిని.. సత్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ, సత్ప్రవర్తన మార్గంలో నడిపిస్తాయని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ అన్నారు. శ్రీకృష్ణుడి దివ్య సందేశాల్లో నిస్వార్థ కర్మకు సంబంధించిన గొప్ప స్ఫూర్తి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ పవిత్ర జన్మాష్టమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితంలో సానుకూల శక్తి, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

=========================

భూస్థిర కక్ష్యలోకి భారతదేశపు తొలి ఇమేజింగ్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ ఎఫ్17 విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈరోజు తెల్లవారుజామున ఈ ప్రయోగం జరిగింది. ఇస్రో తెలిపిన వివరాల ప్రకారం... అత్యాధునిక భూ పరిశీలనా ఉపగ్రహం ఈఓఎస్-05ను ప్రయోగించిన సుమారు 18 నిమిషాల తర్వాత ఉప-భూస్థిర కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టారు. 27 గంటల పాటు కొనసాగిన కౌంట్‌డౌన్ విజయవంతంగా పూర్తైన అనంతరం.. 2 వేల 367 కిలోల పేలోడ్‌తో కూడిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి తెల్లవారుజామున 2 గంటల 55 నిమిషాలకు నిర్ణీత సమయానికి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఇమేజింగ్ ఉపగ్రహం రియల్‌టైమ్ చిత్రాలను అందించడంతో పాటు.. వ్యవసాయం, విపత్తుల నిర్వహణ సహా పలు రంగాల్లో దేశానికి ఉపయోగపడనుంది. ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఈ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు దోహదపడుతుందని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూస్థిర కక్ష్య నుంచి భారతదేశపు తొలి ఇమేజింగ్ ఉపగ్రహం ఈఓఎస్-05ను మోసుకెళ్లిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్-17 ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి ఈరోజు చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ... ఈ విజయం భారత అంతరిక్ష రంగం సాధిస్తున్న అత్యుత్తమ ప్రతిభ, సాంకేతిక ఆవిష్కరణలు, పెరుగుతున్న సామర్థ్యాలకు నిదర్శనమన్నారు. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం దేశ అంతరిక్ష కార్యక్రమానికి మరింత బలం, విస్తృతిని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ విజయాన్ని ఇస్రోకు అత్యుత్తమ ఘనతగా, దేశానికి గర్వకారణమైన సందర్భంగా నరేంద్రమోదీ అభివర్ణించారు. అలాగే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ... ఈ విజయం భారత భూ పరిశీలనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇది దేశ అంతరిక్ష కార్యక్రమం సాధిస్తున్న సాంకేతిక పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు రోజుల బ్రిక్స్ ప్రధాన న్యాయమూర్తుల సదస్సు ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలకు చెందిన ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీంకోర్టుల అధ్యక్షులు, ఉన్నతస్థాయి న్యాయాధికారులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. సదస్సులో భాగంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. రష్యా, చైనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దక్షిణాఫ్రికా, ఇరాన్, ఉజ్బెకిస్థాన్ సహా పలు దేశాల న్యాయ ప్రతినిధి బృందాల అధిపతులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో దేశాల మధ్య న్యాయ సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, న్యాయవ్యవస్థ సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించడం, సత్వర న్యాయ ప్రక్రియల ద్వారా ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరచడం, వివిధ దేశాల్లో అమలులో ఉన్న అత్యుత్తమ న్యాయ విధానాలను పరస్పరం పంచుకోవడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ఈరోజు చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీ ప్రాంగణంలో కేంద్ర పరికరాల ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన అధునాతన విశ్లేషణాత్మక పరికరాల సౌకర్య కేంద్రం, అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ సౌకర్యాల ద్వారా జీవశాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, ఇంజినీరింగ్‌తో పాటు ఇతర అనుబంధ రంగాల్లో విశ్వవిద్యాలయ విశ్లేషణ, పరిశోధనా సామర్థ్యాలు మరింత మెరుగుపడనున్నాయి. అదేవిధంగా, పంజాబ్ యూనివర్సిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన సి. పి. రాధాకృష్ణన్... పంజాబ్ యూనివర్సిటీ 143 సంవత్సరాల ఘన చరిత్రను కొనియాడారు. విశ్వవిద్యాలయానికి 80 శాతం

నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తోందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఉపరాష్ట్రపతి పిలుపునిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఫ్రాన్స్‌తో అంతరిక్ష భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుంటోందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఫ్రాన్స్ ఉన్నత విద్య, పరిశోధన, అంతరిక్ష శాఖ మంత్రి ప్రొఫెసర్ ఫిలిప్ బాప్టిస్ట్‌తో జితేంద్ర సింగ్ ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అంతరిక్ష రంగంలో భారత్-ఫ్రాన్స్ మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపై చర్చలు జరిపారు. పారిస్‌లో జరగనున్న అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో భారత్ పాల్గొనడం, బెంగళూరు స్పేస్ ఎక్స్‌పోలో ఫ్రాన్స్ భాగస్వామ్యం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. భారత్ అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తోందని జితేంద్ర సింగ్ తెలిపారు. ఇరు దేశాల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేసి... వేగవంతం చేయాలన్నది ఫ్రాన్స్ ఆకాంక్ష అని ఫ్రాన్స్ మంత్రి ప్రొఫెసర్ బాప్టిస్ట్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగుతున్న జార్జియా మెలోనీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదికగా ప్రధానమంత్రి స్పందిస్తూ... ఈ ఘనత జార్జియా మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి, నమ్మకానికి నిదర్శనమన్నారు. భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జార్జియా మెలోనీతో ఉన్న స్నేహం కూడా కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలకు ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్, ఇటలీ కలిసి రెండు ఖండాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్‌లో రేపటి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈరోజు హర్యానా, చండీఘర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌తో పాటు ఈశాన్య ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =